వడ్డెరల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న అంతయ్య

చిక్కడపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని వడ్డెరల సమస్యలు పరిష్కరించేందుకు సహకరించాలని కోరుతూ వడ్డెరసంఘం నాయకులు శుక్రవారం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వడ్డెర లక్ష్యసాధన అధ్యక్షుడు జరిపిటి సత్యనారాయణరాజు, వడ్డెరసంఘం తెలంగాణ(గన్నుదెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి అంతయ్య, వడ్డెరసంఘం ముఖ్య సలహాదారుడు డా. ఓర్సు కృష్ణయ్య మాట్లాడుతూ మైనింగ్‌ల ఆక్షలు పెడుతున్నప్పుడు వడ్డెరలకు ఉన్న 10శాతం రిజర్వేషన్ అమలు చేయాలని మంత్రిని కోరామన్నారు. వడ్డెరలు ప్రమాద క్వారీలో మరణించినట్లయితే వారికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, వడ్డెరలకు డంపింగ్ యార్డ్ కోసం జిల్లాకు 10ఎకరాలు కేటాయించాలని మంత్రి ప్రభాకర్‌ను కోరామని తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఈ సమస్యల పరిష్కారానికి సహకరిస్తామనని మంత్రి తమకు హామీనిచ్చారని వారు పేర్కొన్నారు.

అయ్యప్ప మాలదీక్ష స్వీకరించిన ఎమ్మెల్యే వెంకటేష్



అయ్యప్ప దీక్ష స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

నల్లకుంట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బాగ్ అంబర్‌పేటలోని అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అయ్యప్ప మాల దీక్ష స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అయ్యప్పస్వామి దివ్యకృపతో అందరికీ శాంతి, ఆనందం కలగాలని ఆకాంక్షించారు.

మల్లేష్ గురుస్వామిని సత్కరించిన ఎమ్మెల్యే

కేరళలోని శబరిమలకు 18వ యాత్ర చేసి అయ్యప్పస్వామిని దర్శించుకుని శుక్రవారం నగరానికి వచ్చిన చింతకింది మల్లేష్ గురుస్వామిని అయ్యప్ప స్వామి ఆలయంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ శాలువాకప్పి సత్కరించారు.



మహాపడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, జైసింహ తదితరులు

వైభవంగా అయ్యప్ప మహాపడి పూజ

- ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్‌లో శ్రీవీర మణికంఠ సేవా సమితి అధ్యక్షుడు కోడూరు రాజు ఆధ్వర్యంలో 13వ అయ్యప్పస్వామి మహాపడి పూజ వైభవంగా జరిగింది. శుక్రవారం ఈ మహాపడి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎం.ఎన్.శ్రీనివాసరావు, యువజన నాయకుడు ముఠా జైసింహలు హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వీర మణికంఠ సేవా సమితి నాయకులు దేవరాజ్, రాజు, స్వామి, నందికంటి గోపాలరావు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, డివిజన్ ఉపాధ్యక్షులు జి.రాజు, పూస గోరఖ్‌నాథ్, నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, జె.ఎస్.పటేల్ తదితరులు పాల్గొన్నారు.

నల్లకుంట డివిజన్ సమగ్రాభివృద్ధే లక్ష్యం : అమృత



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అమృత, జీహెచ్ఎంసీ అధికారులు

నల్లకుంట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : నల్లకుంట డివిజన్ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని కార్పొరేటర్ యాకర అమృత పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్‌లోని బ్రాహ్మణ హాస్టల్ వీధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ డీఈ ప్రవీణ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్‌తో కలిసి ఆమె పరిశీలించారు. డివిజన్‌లోని శంకరమఠం కూరగాయల మార్కెట్ రోడ్డు, ఇస్తరాకుల వీధిలోని మాతృశ్రీ పాఠశాల వీధి, గాంధీనగర్ లంక, మేదర్‌బస్తీలోని డ్రైనేజీ పైప్‌లైన్, రోడ్డు పనులు, సత్యానగర్ కమ్యూనిటీహాల్‌లో రిపేర్ పనులు, తిలక్‌నగర్ రోడ్డులో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు వెంటనే పూర్తి చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎస్.శ్రీనివాస్, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు అనుమతులు ఇవ్వాలి : లావణ్య



జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్‌లావణ్య


గోల్నాక, డిసెంబర్ 5(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో రూ.2కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు త్వరగా అనుమతులు ఇవ్వాలని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌ను జోనల్ కార్యాలయంలో కార్పొరేటర్ కలిసి డివిజన్‌లో చేపట్టే పనుల విషయమై పూర్తి వివరాలతో కూడిన వినతిపత్రం అందజేసి వివరించారు. డివిజన్‌లోని కమలానగర్, వడ్డెరబస్తీ, సుందర్‌నగర్, ఫాతిమానగర్, మారుతినగర్, అశోకానగర్, నింబోలిఅడ్డ రైల్వే బ్రిడ్జి లైన్, ఖాద్రీబాగ్, నెహ్రూనగర్, తులసీరామ్‌నగర్(లంక), జైస్వాల్‌గార్డెన్, కృష్ణానగర్ అంబేద్కర్ విగ్రహం లేన్, సంజయ్‌గాంధీనగర్, టక్కీజైలు తదితర ప్రాంతాలలో రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు ఆమె పేర్కొన్నారు. పనులకు అనుమతులు లభించిన వెంటనే పనులను ప్రారంభిస్తామని ఆమె పేర్కొన్నారు. జోనల్ కమిషనర్‌ను కలిసిన వారిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

వీహెచ్‌ను సత్కరించిన కాంగ్రెస్ నేతలు

రాంనగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం, రాష్ట్ర ప్రగతి కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం మాజీ ఎంపీ వి.హనుమంతరావు అందిస్తున్న సేవలకు గానూ దివంగత మాజీ సీఎం రోశయ్య స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో వీహెచ్‌కు స్మారక అవార్డు స్వీకరించడం పురస్కరించుకుని ఖైరతాబాద్ జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం అభినందన సత్కారం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, పులి జగన్, సీనియర్ నాయకులు భగవాన్, రాజు గౌడ్‌తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూతనివ్వాలి

- డిప్యూటీ డీఈవో శ్రావణ్‌కుమార్



బహుమతులు అందజేస్తున్న డిప్యూటీ డీఈవో శ్రావణ్‌కుమార్, ఐఓఎస్ స్వరూపరాణి

ముషీరాబాద్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు చేయూతనివ్వాలని డిప్యూటీ డీఈవో శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ముషీరాబాద్‌లోని భవిత కేంద్రంలో దివ్యాంగులకు నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఐఓఎస్ స్వరూపరాణి భవిత కేంద్రానికి సౌండ్ సిస్టంను తన సొంత డబ్బులతో అందజేశారు. శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ భవిత కేంద్రంలో చేరిన దివ్యాంగ బాలురకు రూ.5వేలు, బాలికలకు రూ.7వేలు ప్రతిఏటా పిల్లల తల్లిదండ్రుల అకౌంట్లలో వేస్తారని అన్నారు. కార్యక్రమంలో భవిత కేంద్ర జిల్లా కోఆర్డినేటర్ కనీస్ ఫాతీమా, ఐఈఆర్‌పీలు మల్లేష్‌గౌడ్, విజయ తదితరులు పాల్గొన్నారు.

సాయిఈశ్వరాచారిది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే

డాక్టర్ ర్యాగ అరుణ్‌కుమార్, డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు



మాట్లాడుతున్న డాక్టర్ ర్యాగ అరుణ్‌కుమార్, డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు తదితరులు

రాంనగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ప్రాణత్యాగం చేసిన సాయిఈశ్వరాచారిది ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కో-ఆర్డినేటర్ డాక్టర్ ర్యాగ అరుణ్‌కుమార్, డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావులు ఆరోపించారు. అతని కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేసి బీసీలకు 42శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించాలని వారన్నారు. శుక్రవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీసీలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చకపోవడం వల్లే సాయిఈశ్వరాచారి ఆత్మహత్యకు పాల్పడ్డారని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై కాంగ్రెస్‌కి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రాజ్యాంగపరంగా రావాల్సిన హక్కుల సాధన కోసం ఎంత మంది బీసీలు ప్రాణత్యాగం చేయాలని ప్రశ్నించారు. ప్రాణత్యాగం చేసిన సాయిఈశ్వరాచారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. జీవో 46 రద్దు చేయాలని, కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని ఈనెల 11న ఢిల్లీలో ఏఐసీసీ కార్యాలయం ముట్టడిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, కన్వీనర్ సి.రాజేందర్, నీల వెంకటేష్, నాయకులు సతీష్, రాజునేత, అనురాధగౌడ్, జి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

సాయిఈశ్వరాచారి మరణానికి కారణం పాలకుల పాపమే

బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు

రాంనగర్ : బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోవడం వల్లే బీసీ ఉద్యమకారుడు సాయిఈశ్వరాచారి ఆత్మహత్య చేసుకున్నాడని, ఈ మరణానికి కారణం పాలకుల పాపమేనని బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్ ఆరోపించారు. శుక్రవారం చిక్కడపల్లిలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం వల్ల బీసీలకు తీరని అన్యాయం జరుగుతుందని ఆశించిన సాయిఈశ్వరాచారి కాల్చుకుని ప్రాణత్యాగం చేశారని పేర్కొన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, సర్పంచ్ ఎన్నికలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. బీసీ, ఎస్సీ ఎస్టీ జేఏసీ చైర్మన్ విశారదన్ మహరాజ్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ కన్వీనర్ అంబాల నారాయణగౌడ్‌లు మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకున్న సాయిఈశ్వరాచారికి ప్రభుత్వం సకాలంలో మెరుగైన వైద్య చికిత్సలు అందించకపోవడం వల్లే మరణించాడని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యెలికట్టె విజయ్‌కుమార్ గౌడ్ దుర్గయ్యగౌడ్, బైరు శేఖర్, గోపీ, విజయ్‌కుమార్ గౌడ్, హర్షవర్ధన్, మధుసూదన్ పాల్గొన్నారు.

పత్తి విత్తన చట్టాన్ని ఆమోదించడానికి ప్రభుత్వం కుట్ర

- రైతుకూలీ సంఘం



కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తున్న రైతు కూలీ సంఘం నేతలు

రాంనగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): శీతకాల పార్లమెంట్ సమావేశాల్లో 2025 పత్తి విత్తన చట్టాన్ని ఆమోదించడానికి మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పట్లోళ్ల నాగిరెడ్డి, వెల్తురు సదానందంలు ఆరోపించారు. పత్తి విత్తన చట్టం కార్పొరేట్ సంస్థలకు లాభం, రైతులకు నష్టం కలిగించేదే అని విమర్శించారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రం వద్ద రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో కార్పొరేట్ సంస్థలైన మోనోశాంటో, సిజెంటా, టాటా తదితర ప్రవేశం వల్ల కల్తీ విత్తనాలు పెరిగిపోయాయన్నారు. దీంతో రైతులు నేటికీ కల్తీ విత్తనాల తయారీదారులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వాపోయారు. 2025 పత్తి విత్తన చట్టం, విద్యుత్ బిల్లుల సవరణకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 8న ఆ చట్టం ప్రతుల దహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు కూలి సంఘం రాష్ట్ర కోశాధికారి జి. వెంకటేశ్వర్‌రావు, నాయకులు యుగేందర్, సత్తన్న, బోనాల స్వామి, చంద్రం, రామచంద్రన్న పాల్గొన్నారు.



చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భాగ్యలక్ష్మి

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

బర్కత్‌పుర, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మహిళా బిల్లులో ఓబీసీ మహిళలకు సబ్ కోటా విధించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16,17,18 తేదీల్లో జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం కాచిగూడలోని ఓబీసీ కార్యాలయంలో ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు వి.దానకర్ణచారితో కలిసి చలో ఢిల్లీ వాల్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. ఓబీసీ మహిళలకు సబ్‌కోటా విధిస్తేనే దేశంలో ఉన్న ఓబీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ఈ చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 16, 17న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 18న ఓబీసీలతో జాతీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.రవికుమార్‌ముదిరాజ్, సి.రామ్మూర్తి, శ్రీనివాస్, అంబికా, చిత్తరంజన్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి చర్యలు

చిక్కడపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్ శ్రీమయూరి లేన్‌లో నూతన రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు జీహెచ్ఎంసీ సర్కిల్ 15 ఇంజనీరింగ్ సెక్షన్ ఏఈ అబ్దుల్ సలామ్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం శ్రీమయూరి లేన్‌లో పాడైపోయిన రోడ్డు స్థానంలో నూతన రోడ్డు ఏర్పాటు కోసం వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌తో కలిసి పరిశీలన జరిపారు.

బిటి రోడ్లకు మరమ్మతులు

చిక్కడపల్లి, డిసెంబర్ 5(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ సెక్షన్ సిబ్బంది గుంతలు పడ్డ బిటి రోడ్లకు మరమ్మతు నిర్వహించారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదేశాల మేరకు సిబ్బంది శుక్రవారం డివిజన్‌లోని గాంధీనగర్, సంజయ్‌నగర్, చిక్కడపల్లి ప్రాంతాల్లో గుంతలు పడ్డ రోడ్లపై రెడీమిక్స్ మెటీరియల్ వేసి గుంతలు పూడ్చారు. ఈ పనులను బీఆర్ఎస్ నేత బత్తుల కిరణ్‌కుమార్ పర్యవేక్షించారు.

23నుంచి పద్యనాటకోత్సవాలు

చిక్కడపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆరాధన సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 23నుంచి 26వరకు నాలుగురోజులపాటు త్యాగరాయగానసభలో పద్యనాటకాల ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు లోకం కృష్ణయ్య తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. 16 సంవత్సరాలుగా పద్యనాటకాల ప్రదర్శనలు జరుగుతున్నాయని ఈ ఏడాది కూడా ఈ ఉత్సవాలు విజయవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 23న బాలనాగమ్మ, 24న పాండవోద్యోగము నుంచి మయసభ, శయన దృశ్యం, రామాంజనేయ యుద్ధం, 25న భక్త కుచేల, 26న దదిశి పద్య నాటక ప్రదర్శనలుంటాయని మొదటిరోజు కార్యక్రమాన్ని ప్రముఖ రచయిత డా. ఎం కె రాము ప్రారంభిస్తారని వివరించారు.

కవి పండితులు, విద్యావేత్త సీఆర్‌రెడ్డి : వక్తలు



సీఆర్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న జనార్దనమూర్తి, సుబ్బారావు తదితరులు

చిక్కడపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కట్టమంచి రామలింగారెడ్డి(సీఆర్‌రెడ్డి) కవి, పండితులు, విద్యావేత్త అని వక్తలు కొనియాడారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎందరో మహానుభావుల మధురస్మృతులలో భాగంగా శుక్రవారం కట్టమంచి రామలింగారెడ్డి యాదిలో సంస్మరణ సమావేశంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా జనార్దనమూర్తి మాట్లాడుతూ 1880లో చిత్తూరు జిల్లా కట్టమంచిలో జన్మించిన సిఆర్‌రెడ్డి కేంబ్రిడ్జి యూనివర్సిటీలో ఉన్నత విద్యాభ్యాసం పూర్తిచేసి జాతిసేవకు తిరిగివచ్చారని 19 ఏళ్ల వయస్సులోనే ముసలమ్మ మరణం ఖండకావ్యం రచించి ప్రథమ బహుమతి పొందారన్నారు. ప్రతి ఊరికి ఒక పాఠశాల ఉద్యమం ప్రారంభించిన ఘనత సీఆర్‌రెడ్డిదేనన్నారు. ప్రముఖ రచయిత పొత్తూరు సుబ్బారావు ప్రసంగిస్తూ విద్వాంసుడు పురస్కారం అందుకున్న రామలింగారెడ్డి 1905లో కేంబ్రిడ్జి యూనివర్సిటీలో యూనియన్ లిబర్ క్లబ్ కార్యదర్శిగా ఎన్నికై ఆంగ్లేయుల మన్ననలు అందుకున్నారని గుర్తుచేశారు. మైసూరు విద్యాశాఖలో ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా పనిచేశారని వివరించారు. మద్రాస్ శాసనసభలో సభ్యుడుగా ఉన్న సీఆర్‌రెడ్డి ఆంధ్రవిశ్వవిద్యాలయం స్థాపక వీసీగా కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. మిమిక్రీ కళాకారులు మల్లం రమేష్, భవిరి రవి, గాయని లక్ష్మీశాంతి పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవలో సంతృప్తి ఉంటుంది

- హైకోర్టు న్యాయవాది నరసింహారావు



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న న్యాయవాది నరసింహారావు, ఏఎంహెచ్‌వో హేమలత

గోల్నాక, డిసెంబర్ 5(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛందసేవలో చాలా సంతృప్తి ఉంటుందని హైకోర్టు సీనియర్ న్యాయవాది జి.వి.ఎల్. నరసింహారావు, జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్ ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత అన్నారు. అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సేవాయాత్ అసోసియేషన్ అధ్యక్షుడు రచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గోల్నాక డివిజన్ అశోకానగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు, హేమలతలు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని అన్నారు. పారిశుధ్య కార్మికులను సత్కరించుకోవడం అభినందనీయమన్నారు. రచ్చ శ్రీనివాస్ స్వచ్ఛందంగా చేస్తున్న సేవలు ఎనలేనివని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పురుషోత్తం, డాక్టర్ శివ, ఆధ్యాత్మిక వేత్త బాబా చంద్రపాల్, అసోసియేషన్ ప్రతినిధులు కిషోర్‌నేత, ప్రవీణ్‌కుమార్, పోచయ్య పాల్గొన్నారు.

అఖండ 2 ప్రీమియర్ షో రిలీజ్ ఆగడంతో అభిమానుల నిరాశ

చిక్కడపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ 2 సినిమా గురువారం రాత్రి ప్రీమియర్ షో రద్దు కావడంతో పాటు శుక్రవారం సినిమా రిలీజ్ కాకపోవడంతో అభిమానులు నిరాశకు గురయ్యారు. ఉదయం నుంచి ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని సుదర్శన్, దేవి థియేటర్ బయట అభిమానులు వేచి ఉన్నారు. శుక్రవారం సాయంత్రం ఈ సినిమా రిలీజ్ అవుతుందన్న సమాచారం రావడంతో అభిమానులు గేట్ వద్దే వేచి ఉన్నారు. సాయంత్రం వరకు కూడా ఎలాంటి సమాచారం రాకపోవడంతో అభిమానులు థియేటర్‌ల గేటువద్దే తచ్చాడారు.



బాగ్‌అంబర్‌పేట డివిజన్ సోమసుందర్‌నగర్‌కాలనీలో ఆగస్టు 19న వినాయక చవితి మండపం వద్ద కరెంట్ షాక్‌కు గురై మృతిచెందిన నన్నెబోయిన రాంచరణ్‌తేజ్‌కు విద్యుత్‌శాఖ మంజూరు చేసిన రూ.5లక్షల చెక్కును ఆయన సతీమణి లలితకు కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి, ఆజామాబాద్ డివిజన్ ట్రాన్స్‌కో డీఈ కమల్‌కుమార్, ఏడీఈ శీనయ్య, ఏఈ నాగరాజులు అందజేశారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి



బాగ్‌లింగంపల్లిలోని లంబాడీ తండాలో బీజేపీ నగర నాయకుడు బన్సీ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం అయ్యప్ప స్వామి మహాపడిపూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి, అయ్యప్ప స్వాములు పెద్దఎత్తున పాల్గొన్నారు. పూజా అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది. - రాంనగర్, ఆంధ్రజ్యోతి

వేర్వేరు రైలు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

బర్కత్‌పుర, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : వేర్వేరు రైలు ప్రమాదాల్లో ఇద్దరు గుర్తు తెలియని వారు మృతిచెందారని కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపారు. బుద్వేల్ - ఉందానగర్ రైల్వేస్టేషన్ల నడుమ 50ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని మహిళ పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. మరో సంఘటనలో డబీర్‌పుర- యాకత్‌పుర రైల్వే స్టేషన్ల నడుమ పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తున్న 45ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తికి రైలు ఢీకొట్టడంతో చనిపోయాడు. మృతదేహం పూర్తిగా కుళ్లిపో యి ఉండడంతో నాలుగు రోజుల క్రితం ఈ ప్రమాదం జరిగి ఉం డవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ రెండు సంఘటనలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయి మొక్కలు పెంచుతున్న ఇద్దరి అరెస్టు

గోల్నాక, డిసెంబర్ 5(ఆంధ్రజ్యోతి): కాచిగూడ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మలక్‌పేట మహబూగంజ్‌లోని ఓ ఇంటి పెరటిలో గంజాయి మొక్కలు పెంచుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ పి.శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేట మహబూబ్‌గంజ్‌లో ఉంటున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అలహాబాద్‌కు చెందిన లవ్‌కుష్, భీమేష్‌లు ఇంటి పెరటిలో గంజాయి మొక్కలు పెంచుతూ విక్రయాలను కొనసాగిస్తున్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం సాయంత్రం దాడిచేయగా వారి అక్రమ దందా వెలుగులోకి వచ్చింది. ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 5గ్రీన్‌కలర్ మూడు నుంచి ఆరు ఫీట్ల గంజాయి మొక్కలను, 55గ్రాముల డ్రై గంజాయిని, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. వారి పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పోలీసుల అదుపులో వృద్ధుడి వద్ద డబ్బులు లాక్కెళ్లిన వ్యక్తి..!

కవాడిగూడ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బ్యాంకులో డబ్బులు డ్రా చేసుకొని వెళ్తోన్న వృద్ధుడి వద్ద నుంచి బ్యాగును చోరీ చేసిన నిందితుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్ఆర్‌నగర్‌లో ఉంటోన్న రిటైర్డ్ ప్రైవేట్ ఉద్యోగి వెంకటేశ్వర్‌రావు(67) అశోక్‌నగర్‌లోని యూనియన్ బ్యాంకు నుంచి నగదు డ్రా చేసుకొని కారు వద్దకు వెళ్తుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ వ్యక్తి బ్యాగు లాక్కొని పారిపోయాడు. ఆయన ఫిర్యాదు మేరకు సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కవాడిగూడ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని మోతీలాల్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

జమిస్తాన్‌పూర్ గౌడ సంఘంలో నిధుల దుర్వినియోగం జరగలేదు

- సంఘం మాజీ కోశాధికారి లక్ష్మణ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి జయహరి



మాట్లాడుతున్న పి.లక్ష్మణ్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, భిక్షపతి తదితరులు

రాంనగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జమిస్తాన్‌పూర్ గౌడ సంఘంలో నిధుల దుర్వినియోగం జరిగిందని సంఘం మాజీ అధ్యక్షుడు శిరీష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి లింగాల శ్రీకాంత్‌గౌడ్‌లు చేసిన ఆరోపణల్లో నిజం లేదని సంఘం మాజీ కోశాధికారి పి.లక్ష్మణ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి టి.జయహరి, సభ్యులు పి.వెంకటేష్‌గౌడ్, బి.భిక్షపతిగౌడ్‌లు పేర్కొన్నారు. గౌడ సంఘానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై 2021 నవంబర్ 2న జరిగిన గౌడ సంఘం సమావేశంలో సంఘానికి సంబంధించి మొత్తం రూ.39లక్షలలో ఖర్చులు పోను మిగిలిన రూ.14లక్షలను సంఘం సభ్యులు ఏర్పాటుచేసుకున్న 9మందితో ఏర్పడిన కమిటీ సభ్యులకు అదే రోజున అప్పగించడం జరిగిందన్నారు. శుక్రవారం రాంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల జరిగిన సంఘం ఎన్నికల్లో నూతన కమిటీ ఎన్నుకోబడిందని, ఆ కమిటీ చట్టప్రకారంగా సభ్యులు ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఎన్నికల్లో పాల్గొని గెలిచే సత్తా లేని శిరీష్‌గౌడ్, లింగాల శ్రీకాంత్‌గౌడ్‌లు తమపై తప్పుడు ప్రచారం చేసి సంఘం సభ్యులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. 2021లో జరిగిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన సమావేశంలో వీరిద్దరూ పాల్గొని తీర్మానాల పత్రాలపై సంతకాలు చేసిన విషయాన్ని మరచిపోయి మాట్లాడడం సబబు కాదన్నారు. వారిద్దరూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఉన్న కాలంలో సంఘానికి సంబంధించిన దాదాపు రూ.19లక్షలను ముషీరాబాద్ సెంట్రల్ బ్యాంకులో ఎఫ్‌డీ చేయడం జరిగిందన్నారు. ఆ ఎఫ్‌డీలను వెంటనే నూతన కమిటీలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. శిరీష్ గౌడ్ ఆధ్వర్యంలో ఉన్న సంఘానికి సంబంధించిన మూడు మడిగెలను కొత్త కమిటీకి అప్పగించి సొసైటీ సభ్యులకు సహకరించాలని కోరారు. మరొకసారి తమపై తప్పుడు ఆరోపణలు చేస్తే న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీజేపీ మహాధర్నాను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ రమేష్

నల్లకుంట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో శివారు మున్సిపాలిటీలను విలీనం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైంది కాదని మాజీ కార్పొరేటర్ వనం రమేష్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 7న ఇందిరాపార్కు వద్ద బీజేపీ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఆయన కోరారు. శుక్రవారం బీజేపీ నల్లకుంట డివిజన్ కార్యాలయంలో బూత్ 6,7,8,9,10,11 శక్తి కేంద్రం ఇన్‌చార్జి శ్యామ్‌రాజ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న విలీన నిర్ణయం వల్ల వందలాది గ్రామాలు స్వయం ప్రతిపత్తి కోల్పోతాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.రాంజగదీష్ ముదిరాజ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

గోల్నాక: ఇందిరాపార్కు వద్ద ఈనెల 7న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధానకార్యదర్శి ఏడెల్లి అజయ్‌కుమార్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీజేపీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు సూదగాని శ్రీధర్‌గౌడ్ అధ్యక్షతన డివిజన్‌లోని గంగానగర్‌లోగల కమ్యూనిటీహాల్‌లో ఆదివారం జరుగనున్న ధర్నాపై సన్నాహక సమావేశం జరిగింది. ఈసమావేశంలో అజయ్‌కుమార్ మాట్లాడుతూ ధర్నాని విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ సెంట్రల్ జిల్లా కార్యాలయ కార్యదర్శి మూల రవీందర్‌గౌడ్, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేసరి నర్సింగ్‌రావుయాదవ్, పార్టీ నేతలు కె.రాంచందర్, మహ్మద్ సలీమ్, బి.ఈశ్వర్‌రావు, సావిత్రి, సింగీతం రాజేష్, రాము, కృష్ణ, బద్రి, గోపాల్, కట్టెల సతీష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ముషీరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనను నిరసిస్తూ ఈనెల 7న ఇందిరాపార్కు వద్ద నిర్వహించే బీజేపీ మహాధర్నాను విజయవంతం చేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జమల్‌పూరి నందు కోరారు. శుక్రవారం ముషీరాబాద్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్నాకు ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి వందలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీధర్, రమేష్, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.